

కిక్ బాక్సింగ్‌లో హనీప్రియకు గోల్డ్‌మెడల్



కందుకూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అస్మిత కిక్ బాక్సింగ్ పోటీల్లో మండల పరిధిలోని కొత్తగూడ గ్రామానికి చెందిన సిద్దగౌని హనీప్రియ బంగారు పతకం సాధించింది. శనివారం నుంచి రెండు రోజులపాటు వరంగల్‌లో జరిగిన ఈ పోటీల్లో ఆమె పాల్గొని మెడల్ సాధించిందని కోచ్ మల్లేష్ తెలిపారు.

రీయింబర్స్‌మెంట్ వెంటనే ఇవ్వాలి

ఇబ్రహీంపట్నంలో రోడ్డెక్కిన విద్యార్థులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడదల చేయాలని ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య ఇచ్చిన పిలుపు మేరకు ఇబ్రహీంపట్నంలో సోమవారం కళాశాలల బంద్ నిర్వహించి విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు రోడ్డెక్కారు. అంబేడ్కర్ చౌరస్తా మీదుగా ర్యాలీగా వెళ్లి తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళనకు చేపట్టారు. అలాగే పక్కనే ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతున్న మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలల నిర్వహణ భారంగా మారిందంటూ యాజమాన్యాలు ఆందోళన వెలిబుచ్చాయి. అప్పులు చేసి కళాశాలలను నెట్టుకొస్తున్నామని ఇంకెంతోకాలం ఈ భారం భరించలేమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో కె.అనంతరెడ్డికి వినతి పత్రం అందజేశారు.


ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించిన విద్యార్థులు


ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

» అదనపు కలెక్టర్ శ్రీనివాస్

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 33 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. డీఆర్వో సంగీత పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి

పల్స్ పోలియో కార్యక్రమం అక్టోబర్ 12న నిర్వహించనున్నామని, ప్రతీ శిశువుకు చుక్కలు వేయించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పల్స్ పోలియో టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్లలోపు 4.90 లక్షల మంది పిల్లలు ఉన్నట్లు సర్వేలో గుర్తించినట్లు తెలిపారు. వారందరికీ వచ్చే నెల 12న (ఆదివారం) పోలియో కేంద్రాల్లో చుక్కలు వేయించాలని సూచించారు. 13వ తేదీ నుంచి 15 వరకు ఇంటింటికీ వెళ్లి ఆశావర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు పోలియో చుక్కలు వేస్తారని పేర్కొన్నారు.

మాకు కేటాయించిన ఇళ్లను ఇప్పించండి

మాకు కేటాయించిన ఇళ్లను ఇతరులు కబ్జా చేశారని, వాటిని వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేస్తూ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఫేస్-3 లబ్ధిదారులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. 2020 అక్టోబరు నుంచి ఆక్రమణకు గురైన తమ ఇళ్లను తమకు ఇప్పించాలని కోరుతూ ఐదేళ్ల నుంచి అధికారులు చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటి వరకు 220 ఇళ్లను లబ్ధిదారులకు ఇప్పించినట్లు మిగతా గృహాలను కూడా ఇప్పించాలని జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం -ఫేస్-2, ఫేస్-3 ఐక్యవేదిక అధ్యక్షుడు శ్రీనివాస్ రాథోడ్, వైస్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, కోశాధికారి శ్రీదేవి డిమాండ్ చేశారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

అవినీతికి పాల్పడిన మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవై ప్రణయ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్వో సంగీతకు వినతి పత్రం సమర్పించారు. సమయపాలన పాటించని ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని, స్కావెంజర్స్ నిధుల స్కాంపై అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి చేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎరువుల తరంగ్, జిల్లా కమిటీ సభ్యులు సిద్ధు, తరుణ్, కిరణ్, భారత్, జస్వంత్ పాల్గొన్నారు.

» ఓవర్‌డ్యూస్ పేరుతో తొలగింపునకు యత్నం
» రుణం చెల్లించని వారిపై వేలాడుతున్న కత్తి
» బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్లే టార్గెట్?



కదులుతున్న పీఠాలు!

పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లకు పదవీ గండం

ప్రస్తుతం ఉన్న పీఏసీఎస్ చైర్మన్లు అధిక శాతం బీఆర్ఎస్‌కు చెందినవారే. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో వారి పెత్తనం ఏమిటని ఆ పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. వారి పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వారికి ఆ పదవి కట్టబెట్టాలనే డిమాండ్ పెరిగింది. దీంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్యాక్స్ చైర్మన్ల పీఠానికి ఎసరు వచ్చింది. వారిని ఒక్కొక్కరిని తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో 629/2025సి ని తీసుకొచ్చింది. అయితే ముందస్తుగా సొసైటీల్లో రుణం తీసుకుని ఏళ్ల తరబడి చిల్లీగవ్వ కూడా చెల్లించని సొసైటీ చైర్మన్లతో పాటు డైరెక్టర్ల తొలగించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

యాచారం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సొసైటీల్లో రుణం తీసుకుని ఏళ్ల తరబడి చిల్లీగవ్వ కూడా చెల్లించని సొసైటీ చైర్మన్లతో పాటు డైరెక్టర్ల తొలగింపునకు రంగం సిద్ధం అవుతోంది. కేంద్ర సహకార బ్యాంక్ అధికారులు గుట్టుగా చర్యలు సిద్ధమయ్యారు. ముందస్తుగా చైర్మన్లను పదవుల నుంచి తప్పించడానికి సహకార సంఘ అధికారులు 107 ఉత్తర్వులను జారీ చేసినట్లు తెలిసింది. 2025 ఫిబ్రవరి 15 వరకు చైర్మన్ల ఐదేళ్ల పదవీ కాలం ముగియడంతో గత నెల 15న రెండో దఫా ఆరు నెలల పాటు పొడిగించింది.

వారే టార్గెట్ ?

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా సొసైటీలలో బీఆర్ఎస్ చైర్మన్ల పెత్తనమేంటని కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్ల తొలగింపు అంశంపై జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో ఇప్పటికే పలుమార్లు మంతనాలు జరిపినట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా బీఆర్ఎస్ నేతలు సొసైటీల

మిగతా 8వ పేజీలో...


వెంకట్‌రాంరెడ్డిని సన్మానిస్తున్న పాలక వర్గం, కాంగ్రెస్ నేతలు

కందుకూరు ప్యాక్స్ చైర్మన్‌గా వెంకటరాంరెడ్డి

కందుకూరు : కందుకూరు పీఏసీఎస్ చైర్మన్‌గా సత్తినేని వెంకటరాంరెడ్డి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు చైర్మన్‌గా పనిచేసిన డి.చంద్రశేఖర్ పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 629/2025సి జీవో ప్రకారం కొత్త చైర్మన్‌గా సత్తినేని వెంకటరాంరెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు రుణాలు, ఎరువుల పంపిణీకి కృషి చేస్తానని తెలిపారు. డైరెక్టర్లు సాధ పాండురంగారెడ్డి, గౌర పర్వతాలు, మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మాజీ ఎంపీపీ పి.మహేష్‌గౌడ్, ఇ.రాంచంద్రారెడ్డి, బి.ప్రశాంత్‌కుమార్, ఎస్.వీరారెడ్డి, ఏ.సురేందర్, బి.రాములు, డిల్లీ శ్రీధర్, సీఈవో నిమ్మ యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

మహేశ్వరం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా చెన్రెడ్డి జయమ్మ



మహేశ్వరం : మహేశ్వరం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా తుమ్మలూరు గ్రామానికి చెందిన చెన్రెడ్డి జయమ్మను ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నియమించారు. ఇప్పటివరకు చైర్మన్‌గా ఉన్న మంచె పాండు పదవీ కాలం పూర్తి కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌తో పాటు కాంగ్రెస్ నాయకులకు, సంఘం డైరెక్టర్లకు ప్రత్యేక కృతజ్ఞతలని తెలిపారు.

ఎయిర్‌పోర్టు కార్గోలో స్మార్ట్ ఫోర్క్‌లిఫ్ట్స్


నూతనంగా ప్రారంభించిన స్మార్ట్ ఫోర్క్‌లిఫ్ట్

శంషాబాద్‌రూరల్,సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని కార్గోలో నూతన స్మార్ట్ ఫోర్క్‌లిఫ్ట్స్ (చిన్న లిఫ్టులు)ను తీసుకొచ్చినట్లు జీఎంఆర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంషాబాద్ ఎయిర్‌పోర్టులో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఎయిర్ కార్గోలో అంతే వేగంగా వస్తువుల లోడింగ్, ఆన్‌లోడింగ్ చేయాలనే వీటి తీసుకొచ్చామని చెప్పారు. చిన్నచిన్న గోడౌన్లలో పెద్ద లిఫ్టులు పెద్దలిఫ్టులకు బదులు చిన్న లిఫ్టలను వాడుకోవడంతో సమయం ఆదాతో పాటు సులువుగా వస్తువులను లోడింగ్, అన్‌లోడింగ్ చేయవచ్చని పేర్కొన్నారు. వీటిని జీఎంఆర్ సీఈవో ప్రదీప్ ఫణీకర్ ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ సీఈవో, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షల మేరకు పథకాలు 7
అండర్ పాస్ పనులను పూర్తి చేయాలి 7
క్లస్టర్లలో జీపీవోల నియామకం 7

ఎన్నాళ్లీ యూరియా కష్టాలు..


శంకర్‌పల్లిలో యూరియా కోసం రైతుల బారులు

చేవెళ్ల/ షాబాద్/ శంకర్‌పల్లి, సెప్టెంబరు 15: చేవెళ్ల మండలం ఆలూర్ గ్రామంలోని సొసైటీ కార్యాలయం వద్ద, చేవెళ్లలోని మన గ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణం వద్ద సోమవారం ఉదయం నుంచే యూరియా బస్తాల కోసం రైతులు భారీగా బారులు తీరారు. చేవెళ్ల మండలానికి 900 బస్తాల యూరియా వచ్చింది. అయితే చేవెళ్ల మన గ్రోమోర్‌లో 450 బస్తాలు, ఆలూరు సొసైటీ కార్యాలయానికి 450 బస్తాలు వచ్చాయి. యూరియా కోసం రైతులు పెద్ద సంఖ్యలో రావడంతో పోలీస్ పహారాలో రైతులకు టోకెన్లు ఇచ్చి యూరియా ఉన్నంత వరకు అందజేశారు. ఏవో శంకర్‌లాల్, సీఐ భూపాల్ శ్రీధర్ పర్యవేక్షించారు. కాగా చాలామంది రైతులకు యూరియా లభించక నిరాశగా వెనుదిరిగారు. షాబాద్ రైతు వేదిక వద్ద యూరియా పంపిణీకి టోకెన్లు అందజేశారు. వాటికోసం రైతులు పెద్దఎత్తున బారులు తీరారు. అధికారులు అందరికీ టోకన్‌లు ఇచ్చి పంపించారు. అలాగే శంకర్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. అధికారులు ఒక్కో రైతుకు రెండేసి బస్తాలను అందజేశారు. మొత్తం 450 బస్తాలను పంపిణీ చేసినట్లు సొసైటీ సీఈవో రాంరెడ్డి తెలిపారు.


షాబాద్‌లో యూరియా టోకెన్‌ల కోసం బారులు తీరిన రైతులు

నడిగడ్డ తండా వాసులను ఇబ్బంది పెట్టొద్దు

» జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నడిగడ్డ తండావాసులను సీఆర్పీఎఫ్, కస్టోడియన్ అధికారులు ఇబ్బందులకు గురిచేయొద్దని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్‌హుస్సేన్ నాయక్ అన్నారు. సోమవారం శేరిలింగంపల్లి నడిగడ్డ తండాలో జిల్లా ఎస్టీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ ఎస్టీ కమిషన్ పూర్తిగా రాజ్యాంగబద్ధమైన సంస్థ అని, గిరిజన హక్కుల పరిరక్షణతో పాటు సమస్యల పరిష్కారానికి ముందుంటుందని తెలిపారు. నడిగడ్డ తండా లోపలికి సీఆర్పీఎఫ్, కస్టోడియన్ అధికారులు, సిబ్బంది వెళ్లొద్దని, వీలైతే నివాసాలు ఉంటే ఆ ప్రాంతం వరకు హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేసి మిగిలిన స్థలాన్ని రక్షించాలని సూచించారు. ఇందుకు సంబంధించి వారం లోగా తనకు పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సి. నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ వేదిక సమస్యల పరిష్కారానికి తొలిమెట్టుగా మారుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ అధికారులకు సహకరిస్తూ నడిగడ్డ తండావాసులకు కావాల్సిన సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, కస్టోడియన్ అధికారి కమలేష్, సీఆర్పీఎఫ్ అధికారి అమిత్ మిశ్రా, మాజీ ఎంపీ రవీందర్ నాయక్, జిల్లా ఎస్టీ వెల్ఫేర్ అధికారి రామేశ్వరి, రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాటోత్‌హుస్సేన్ నాయక్

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే కుట్ర

షాద్‌నగర్/కేశంపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని అంగన్‌వాడీ టీచర్లు ఆందోళన వ్యక్తం చేశారు. పీఎంశ్రీ, మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాల ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుతూ సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు పూర్తి వేతనంతోపాటు సుప్రీంకోర్టు సూచనల మేరకు గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలన్నారు.


క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కేశంపేటలో..

ప్రీ స్కూళ్లు అంగన్‌వాడీలకే అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి వెళ్తున్న అంగన్‌వాడీ టీచర్లను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేశంపేట, అల్వాల, నిర్దవెల్లి, లేమామిడి గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు గంప లక్ష్మి, సిరిపోలు సులోచన, మంజుల, పద్మావతి, సుగుణ, అమృత కేశంపేట నుంచి షాద్‌నగర్‌కు వెళ్తుండగా అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచాలి

» డీఈవో సుశీంద్రరావు

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): మారిన పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యతను పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీంద్రరావు తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలోని కస్తూర్బా బాలికల పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులు నైపుణ్యం పెంచుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతిలో విద్యా బోధన చేయాలని తెలిపారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం వంటగదిలో భోజనాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ మనోహర్ ఉన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో







అంగన్‌వాడీల సమస్యలపై గళమెత్తుతా


ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు

మహేశ్వరం/కందుకూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలను నిర్వీర్యం చేయాలని చూస్తోందని, తాను అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై అసెంబ్లీలో లేవనెత్తుతానని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. సోమవారం ఐసీడీఎస్ మహేశ్వరం ప్రాజెక్టు పరిధి అంగన్‌వాడీ టీచర్లు తమ సమస్యలపై ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చా రు. వారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో ముఖ్యమంత్రి కేసీఆర్ అంగన్‌వాడీలకు అధిక ప్రాధాన్యం కల్పించారని, కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చే ప్రయత్నం చేస్తోందన్నారు. అంగన్‌వాడీ సమస్యలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసి న్యాయం చేయిస్తానని సబితారెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, కవిత, శేఖర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను భ్రష్టుపట్టించిన కాంగ్రెస్

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యా భ్రష్టు పట్టించిందని, ఏ పాఠశాలకు వెళ్లినా వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ హర్షగూడ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాలలో టాయిలెట్స్ తదితర సమస్యలు ఉన్నాయని విద్యార్థులు ఎమ్మెల్యేకు చెప్పారు. ఆమె డీఈవో ఫోన్లో మాట్లాడి పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఉపాధ్యాయు ల కొరత, విద్యా బోధన వంటి సమస్యలపై ఆమె ఆరా తీశారు. టీచర్లు ఎలా బోధిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ కౌన్సిలర్ రాజునాయక్, మాజీ ఉపసర్పంచ్ రవి ఉన్నారు.

హైటెన్షన్ లైన్ మార్చే వరకు రిలే దీక్షలు


దీక్షలో కూర్చున్న భూ నిర్వాసితులు

కడ్తాల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల మీదుగా నిర్మిస్తున్న 765 హైటెన్షన్ విద్యుత్ టవర్ల పనులను నిలిపేసి అలైన్‌మెంట్‌ను మార్చాలని కడ్తాలలో రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 8వ రోజుకు చేరాయి. నిర్వాసితులకు రాజకీయ నాయకులు సంఘీబావం ప్రకటించారు. దీక్షలో నిర్వాసితులు శంకర్, కృష్ణజంగయ్య, కాలె వెంకటేశ్, లక్ష్మీనారాయణ కూర్చున్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీజేపీ నాయకుడు రమేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణ దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. వారు మాట్లాడుతూ అనుమతి లేకుండా లైన్ నిర్మాణం అన్యాయమన్నారు. వ్యాపారవేత్తల ఒత్తిళ్లతో అలైన్మెంట్ మార్చి కడ్తాల మీదుగా వేస్తున్నారని మండిపడ్డారు. తాము భూములు ఇవ్వం అని స్పష్టం చేశారు. పెంటారెడ్డి, పర్వతకుమార్, రాములు, రాజేందర్ పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరించిన విద్యాసాగర్‌రావు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు తదితరులు

పరిగి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):పరిగికి చెందిన రచయిత డాక్టర్ పి.భాస్కరయోగి రచించిన 'సెప్టెంబరు 17-ముమ్మాటికి విమోచనే' అనే పుస్తకాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు చేతుల మీదుగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆవిష్కరించారు. విమోచనపై కొత్త కోణంలో రచించిన భాస్కరయోగిని పలువురు అభినందించారు. భాస్కరయోగి మాట్లాడుతూ.. తెలంగాణ వారసత్వం అంటే ప్రతాపరుద్రుడు మొదలు అక్కన్న, మాదన్నల వారసత్వమని పేర్కొన్నారు. తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చింది సెప్టెంబరు 17న అని నేటి సమాజానికి తెలియాలంటే, నాటి పోరాటాన్ని వివరించాల్సిందేనన్నారు. పుస్తకావిష్కరణలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, కరుణ, విక్రమ్‌రెడ్డి, శ్యాంసుందర్‌గౌడ్, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.



రోడ్డు అంచున కొట్టుకుపోయిన మట్టి
పొంచి ఉన్న ప్రమాదం

● వాహనదారుల ఇబ్బందులు

చౌదరిగూడ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇటీవలి వర్షాలకు కొత్తగా వేసిన బీటీ రోడ్డు అంచులకు మట్టి కొట్టుకుపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. చేగిరెడ్డి ఘణపూర్‌లో కొన్ని రోజుల క్రితం బీటీ రోడ్డు వేశారు. కొద్ది రోజులకే రోడ్డుపక్కన మట్టి కొట్టుకుపోయి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. పద్మారం-చౌదరిగూడ రోడ్డు మూల మలుపులో కల్వర్టు కుంగి భారీ గుంత ఏర్పడింది. జిల్లేడ్ శివారులో రోడ్డు మధ్యలో వదిలిన సీసీ రోడ్డు పనులు చేయాల్సి ఉంది. ఈ రోడ్డుపై పెద్దఎల్కిచర్ల, వీరన్నపేట్ మీదుగా చౌదరిగూడకు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో రోడ్డుపై పడిన గుంతలో కారు పడి ప్రమాదం జరిగింది. అధికారులు చొరవ తీసుకుని ఈ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు.


చేగిరెడ్డి ఘణాపూర్ శివారులో రోడ్డు అంచున కొట్టుకుపోయిన మట్టి


పద్మారంలో కొట్టుకుపోయిన రోడ్డు మట్టి

రోడ్డుకు మట్టి పోయించాలి



ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా మట్టి కొట్టుకుపోయింది. దీంతో రోడ్డు అంచుల వద్ద వాహనదారులకు ముప్పు పొంచి ఉంది. ఏ మాత్రం సైడ్లకు వెళ్లినా అదుపుతప్పి పడిపోయే ఆస్కారం ఉంది. రాత్రి పూట వెళ్లేవారికి మరింత డేంజర్‌గా మారింది. ఇప్పటికే కొందరు వాహనదారులు పట్టుతప్పి రోడ్డు కిందికి దూరుకుపోయారు. వెంటనే మట్టి పోయించాలి.

- కారుకొండ బాల్‌రాజ్, చెన్నారెడ్డిగూడ





పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలి



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

వికారాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ట్రిపుల్‌ఆర్‌కు సంబంధించి పాత అలైన్‌మెంట్‌నే కొనసాగించాలని నవాబుపేట రైతులు ధర్నా నిర్వహించారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం రైతులు నినాదాలు చేశారు. వీరికి బీఆర్ఎస్, బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. నాయకులు భూములు, వెంచర్ల కోసమే ట్రిపుల్ ఆర్ పాత అలైన్మెంట్‌ను మార్చారని రైతులు ఆరోపించారు. పాత రూట్ ప్రకారమే రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. శుభప్రద్, వడ్లనందు పాల్గొన్నారు.

పనులకు అడ్డుగా ఉన్న నిర్మాణాల కూల్చివేత


ఘట్‌కేసర్‌లో రైల్వే బ్రిడ్జి పక్కన రేకుల షెడ్ల కూల్చివేత

ఘట్‌కేసర్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని రైల్వే వంతెనకు అడ్డుగా ఉన్న నిర్మాణాలను సోమవారం నాయకులు నిర్వాసితులతో కలిసి కూల్చివేయించారు. మునిసిపల్ కాంగ్రెస్ నాయకులు ముల్లి జంగయ్యయాదవ్, మహేష్‌గౌడ్, ఆంజనేయులు, మల్లేష్ ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. పరిహారం కోసం ఇళ్ల యజమానులు కోర్టు ఆశ్రయించడంతో బ్రిడ్జి పనులు నిలిచాయి. దీంతో రెండు సంవత్సరాలుగా ఘట్‌కేసర్‌కు బస్సులు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత వారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వజ్రేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో బాధితలతో మాట్లాడి ఒప్పించి కూల్చివేతలు, పనులు చేపడుతున్నారు. సోమవారం మరోపక్క కొన్ని ఇళ్లను కూల్చివేయించారు. శిథిలాల తొలగింపుతో వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెన నిర్మాణాన్ని అధికారులు త్వరగా పూర్తిచేయించి బస్సుల రాకపోకలను పునరుద్ధరించాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





సీతాఫలాల అమ్మకాలు షురూ..



చౌడాపూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్మన్‌కాల్వ, కొత్తపల్లి, పుర్సంపల్లి, మల్కాపూర్ గ్రామాల పరిధి అటవీ ప్రాంతాల్లో సీతాఫల చెట్లు ఉండడంతో వాటిని అమ్ముతూ ప్రజలు ఉపాధి పొందుతున్నారు. అటవీ ప్రాంతంలో సీతాఫల కాయల సేకరణకు అటవీ శాఖ వేలం నిర్వహిస్తోంది. వీటి అమ్మకాలతో రెండు, మూడు నెలల పాటు కూలీలు ఉపాధి పొందుతున్నారు. మహ్మదాబాద్ రేంజ్ కింద ఇటీవల వేలంలో రూ.7.7లక్షలకు ఓ వ్యక్తి దక్కించుకున్నాడు. వేలం ఆదాయంలో 50శాతం గ్రామాల అభివృద్ధికి వినియోగించనున్నారు. మిగతా డబ్బును అటవీ శాఖ అవసరాలకు వెచ్చిస్తారు. ఈ ప్రాంతంలో లభిస్తున్న సీతాఫలాలను హైదరాబాద్, మిర్యాలగూడ, కోదాడ, విజయవాడ, రాజమండ్రి, విజయనగరం, ఒంగోలు,గుంటూరు ప్రాంత వ్యాపారులొచ్చి కొనుగోలు చేస్తున్నారు. కాగా సీతాఫలాల అమ్మకానికి స్థానికంగా మార్కెట్లు ఏర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కొండ విజయ్‌కుమార్

సమాజంలో వెలుగు నింపేది ఉపాధ్యాయులే

షాబాద్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): సమాజంలో అజ్ఞాన అంధకారాన్ని పారదోలి వెలుగులు నిపేది ఉపాధ్యాయులని, వారు పవిత్ర వృత్తికి న్యాయం చేస్తేనే అభివృద్ధి సాధ్యం అని రాష్ట్ర హాకీ ఫెడరేషన్ చైర్మన్, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం షాబాద్‌లోని బాలుర పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, ఫౌండేషన్ ఆద్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పుతారన్నారు. విద్యార్థి క్రమశిక్షణతో విద్యను పూర్తిచేసుకొని సముచిత స్థానంలో స్థిరపడినప్పుడే తల్లిదండ్రుల, గురువుల శ్రమకు ఫలితం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, హెచ్‌ఎం బాల్‌రాజ్, టీచర్లు సుశీల, కృష్ణయ్య పాల్గొన్నారు.

అండర్ పాస్ పనులను పూర్తి చేయాలి

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బూర్గుల రైల్వే అండర్ పాస్ పనులను త్వరగా పూర్తిచేయాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల రైల్వే అండర్ పాస్ పనులను సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... మూడేళ్లుగా పనులు నత్తనడకన సాగుతున్నాయని తెలిపారు. పనులు త్వరగా పూర్తికాక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులను అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని వాపోయారు. బూర్గుల రైల్వేగేట్ మీదుగా 12గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. మూడు నెలల నుంచి పనులు కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పనుల్లో నాణ్యత లోపం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లేందుకు లేఖ రాస్తానని చెప్పారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు కుమార్‌గౌడ్ ఉన్నారు.

రోడ్డు విస్తరణకు చెట్ల తొలగింపు

బషీరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): హరితహారం కింద పెంచిన చెట్లు కనుమరుగవుతున్నాయి. రోడ్డు విస్తరణలో చెట్లను తొలగిస్తున్నారు. బషీరాబాద్-లక్ష్మీనారాయణపూర్ మధ్య 16.8కిలోమీటర్ల డబుల్ రోడ్డును ఫోర్‌లేన్ పనులు చేపట్టారు. ఈ రోడ్డులో 1,300 వృక్షాలున్నాయి. చెట్ల తొలగింపునకు కాంట్రాక్టర్ అటవీశాఖ అనుమతి కోరగా ఒక్కోచెట్టుకు రూ.500 పరిహారం చెల్లించాలని అధికారులు సూచించారు. మొత్తం చెట్లకు రూ.6.69లక్షలు అటవీ శాఖకు చెల్లించినట్లు కాంట్రాక్టర్ రాజేశ్‌రెడ్డి వెల్లడించారు. దీంతో చెట్ల తొలగిస్తున్నామని చెప్పాడు. దీంతో కాశీంపూర్ వద్ద నేలవాలిన చెట్లతో రోడ్డు బోసిపోయింది.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

వికారాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లు వెంటనే విడుదల చేయాలని వికారాబాద్‌లో విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహించి ఆర్డీవో ఆఫీసు వద్ద ధర్నా చేసి ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు. విద్యార్థులకు బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, బీజేపీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వడ్ల నందు మద్దతు తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

మేడ్చల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్ రాధికగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మొత్తం 113 దరఖాస్తులను స్వీకరించారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన 'డబుల్' ఇళ్ల లబ్ధిదారులు

కీసర రూరల్: దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో నెలకొన్న సమస్యల పరిష్కారంలో చొరవచూపారని కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ రాధికగుప్తాకు ఇళ్ల లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు. వారంతా కలెక్టరేట్‌కు వచ్చి రాధికగుప్తకు పుష్పగుచ్ఛం అందజేశారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ది సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణు మాదవ్ అన్నారు. పోచారం పరిధి సుప్రభాత్ టౌన్‌షిప్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కోల్‌మైన్స్ పెన్షన్-1998 ప్రకారం కనీస పెన్షన్‌ను పెంచాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు రాజయ్య, బీరయ్య, లక్ష్మీనారాయణ, కనకయ్య, పూర్ణప్రకాశ్, మల్లయ్య, నర్సయ్య, ప్రతాప్‌సింగ్, రామరాజు, రఫిక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పూడూరులో గంగమ్మకు పూజలు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామ చెరువులు నిండి అలుగు పారుతున్నందున గ్రామాల్లోని చెరువుల వద్ద స్థానికులు గంగమ్మ పూజలు చేస్తున్నారు. మేడ్చల్ మునిసిపాలిటీ పరిధి పూడూరులో ప్రజలు సోమవారం చెరువు వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, రజలకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు మోక్షం

- స్పందించిన కాంట్రాక్టర్.. ఊపందుకున్న బీటీ పనులు
- సమస్యపై ఆంధ్రజ్యోతి కథనం
- అధికారులపై మంత్రి, ఎమ్మెల్యే సీరియస్

తాండూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తాండూరు-చికారాబాద్ రోడ్డులో కొన్ని నెలల క్రితం రోడ్డును తవ్వి కంకర వేసి వదిలేశారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి కథనం ప్రచురితమైంది. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులపై సీరియసయ్యారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఇప్పటికే అగ్గనూర్-బషీరాబాద్, మైల్వార్ పనులు కొనసాగుతున్నాయి. త్వరలో తాండూరు-కోట్‌పల్లి రోడ్డు పనులు సైతం ప్రారంభించనున్నారు.

రోడ్డు మరమ్మతులకు రూ.50లక్షలు మంజూరు

ఇటీవల వర్షాలకు పాడైన ఆర్‌అండ్‌బీ రోడ్ల పనులకు రూ.50లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో తాండూరు, బషీరాబాద్, యలాల, పెద్దేముల్ మండలాల్లో రోడ్ల మరమ్మతులు చేపడుతున్నారు. అధికారులు ఎస్టిమేట్లు పూర్తిచేసి టెండర్లు కాల్‌ఫర్ చేస్తారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా సత్వరమే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



తాండూరు-వికారాబాద్ రోడ్డులో జరుగుతున్న పనులు

తూంకుంట జలమయం

- కాలనీలు, లోతట్టు ప్రాంతాలకు భారీగా వరద
- రాజీవ్ హైవే, ఆర్‌అండ్‌బీ రోడ్లపై నీటి ప్రవాహం

శామీర్‌పేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): భారీ వర్షంతో తూంకుంట మునిసిపాలిటీలో రోడ్లు, కాలనీలు, స్కూల్ క్యాంపస్‌లు, రాజీవ్ హైవే జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఆదివారం రాత్రి శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపల్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయం సైతం చాలా చోట్ల వరద ప్రవహించింది. లోతట్టు ఇళ్లలో నీరు చేరింది. దొంగల మైసమ్మ సమీప ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద రెండుఫీట్ల ఎత్తున వరద చేరింది. మండలంలోని పలుచోట్ల రాజీవ్ హైవేపై నీరు పారి మధ్యాహ్నం వరకు వాహనాలు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులేర్పడ్డాయి.



దొంగల మైసమ్మ వద్ద నీట మునిగిన రాజీవ్ రహదారి

శామీర్‌పేటలోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణమంతా జలమయమైంది. తూంకుంటలో డబుల్‌బెడ్ రూమ్ అపార్ట్‌మెంట్ల వద్ద చెరువును తలపించింది. దాదాపు 42ఏళ్ల తర్వాత పోతాయిపల్లి చెరువు నిండి మత్తడి పొంగి రోడ్డుపై వరద పారింది. సమీప ఎంఎం రెడ్డి కాలనీలోకి వరద చేరింది. దేవరయంజాల్ పరిధి మహాలక్ష్మీ వెంచర్ జలమయమయింది. దేవరయంజాల్-కొంపల్లికి ఆర్‌అండ్‌బీ రోడ్డుపై మూడుఫీట్ల ఎత్తున నీరు ప్రవహించింది. తూంకుంట మునిసిపాలిటీలో జలమయమైన ప్రాంతాలను, రోడ్లను కమిషనర్ జ్యోతి పరిశీలించారు. సిబ్బందితో నీటిని తొలగింపజేసి సమస్యలు పరిష్కరించారు.



వరద నీరు చేరిన పల్లవి స్కూల్ ప్రాంతం

అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలం

- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘట్‌కేసర్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పి గెలవగానే హామీలను విస్మరించి ప్రభుత్వం మోసగించిందని, అన్ని రంగాల్లో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఘట్‌కేసర్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రుణమాఫీ కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరంను సందర్శించి మద్దుతు ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం రైతులకు ప్రభుత్వం యూరియాను అందించలేకపోతున్నదని ఆరోపించారు. ఎరువుల కోసం రైతులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని విద్యార్థులు ఆందోళన బాటపట్టారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు రుణమాఫీ చేసి ఘట్‌కేసర్ రైతులకు ఎందుకు చేయడం లేదని మండిపడ్డారు. ఈ విషయమై ముఖ్యమంత్రితో పాటు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కాగా, సమావేశంలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ప్రభుత్వం సైతం రైతులను మోసం చేసిందని ఆరోపించడంతో సమావేశంలో గందరగోళం ఏర్పడింది. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రామోజీ, కొండల్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మహేంద్రచారి రైతులు, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు తదితురులు పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/నందిగామ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యమే ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. లిమ్స్ ఆస్పత్రి యాజమాన్యం సుమారు రూ.60లక్షలు విలువ చేసే నాలుగు అత్యాధునిక అంబులెన్స్‌లను షాద్‌నగర్ నియోజకవర్గానికి అందజేసిందని తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ అంబులెన్స్‌ల సమస్యను అధిగమించడానికే లిమ్స్ ఆస్పత్రి సహకారంతో మరో నాలుగు అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఫరూఖ్‌నగర్, కేశంపేట మండలాలకు కలిపి రెండు అంబులెన్స్‌లు, కొత్తురు - నందిగామ, కొందుర్గు - చౌదరిగూడ మండలాలకు రెండు అంబులెన్స్‌లను అందజేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, కమ్యూనిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ విష్ణువర్ధన్, హెల్త్ ఎడ్యూకేటర్ శ్రీనివాస్, నాయకులు రఘునాయక్, బాలరాజు గౌడ్, అగ్గనూరు బస్వం తదితరులు పాల్గొన్నారు. అలాగే నందిగామ మండల కేంద్రంలోని అయ్యప్ప దేవాలయం పునర్‌నిర్మాణంలో భాగంగా అయ్యప్ప, గణపతి, మాళీకాపురోత్తమ అమ్మవార్ల మండపాలు నూతనంగా నిర్మించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగ నర్సింహులు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు జిల్లెల్ల బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

లాల్‌కృష్ణకు నామినేటెడ్ పదవి?

- అధిష్ఠానానికి ఎమ్మెల్యే సిఫారసు లేఖ
- గతంలోనూ సీఎంతో సత్సంబంధాలు
- బీసీ నేతగా పట్టున్న లాల్‌కృష్ణ



లాల్‌కృష్ణ

పరిగి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణానికి చెందిన డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్ రాష్ట్రస్థాయి ప్రభుత్వ నామినేటెడ్ పదవిని ఆశిస్తున్నారు. ఆయన కాంగ్రెస్ ముఖ్య నాయకుడిగానే కాక బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా కొనసాగుతున్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న కార్పొరేషన్ల చైర్‌పర్సన్ లేదా డైరెక్టర్ పోస్టులో ఆయనకు అవకాశం ఇస్తారని స్థానికంగా చర్చ నడుస్తోంది. పరిగి నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు రాష్ట్రస్థాయి పదవుల్లో బీసీలకు పదవి దక్కలేదు. ఈ అంశం లాల్‌కృష్ణప్రసాద్‌కు కలిసొచ్చే అంశం. ఆయనకు రాష్ట్రస్థాయి పదవివ్వాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి సైతం పార్టీ అధిష్ఠానానికి లేఖ రాశారు. లాల్‌కృష్ణ గతంలో టీడీపీ తెలుగు యువత జిల్లా అధ్యక్షుడిగా, పరిగి తాలుకా టీడీపీ ఇన్‌చార్జిగా పనిచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి టీడీపీలో ఉన్న సమయంలో ఆయనతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్‌లో బీసీ నేతగా గుర్తింపు పొందారు. త్వరలో నామినేటెడ్ పదవులను భర్తీచేస్తారన్న వార్తల నేపథ్యంలో లాల్‌కృష్ణ సైతం ప్రధాన కంటెండర్‌గా ఉన్నారు. ప్రభుత్వ నామినేటెడ్ పదవి రాకుంటే డీసీసీ అధ్యక్షుడిగానైనా నియమించాలని ఆయన పార్టీని కోరుతున్నాడు. పార్టీ పదవి బీసీలకిస్తే లాల్‌కృష్ణ పేరు ప్రధానంగా పరిశీలిస్తారని పార్టీ శ్రేణులు సైతం చర్చించుకుంటున్నాయి.

ప్రజల ఆకాంక్షల మేరకు పథకాలు

ఆమనగల్లు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో ప్రతి కుటుంబానికి మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. నాగిళ్లలో రూ.10లక్షలతో చేపట్టే డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. జెడ్పీ పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లు, మూత్రశాలలను, ఆవురుపల్లిలో కంతమహేశ్వరస్వామి ఆలయం వద్ద కొత్తగా వేసిన బోరు మోటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. వివిధ గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో నారాయణరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలు, తండాల ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగానికి పెద్దపీట వేస్తూ కార్పొరేట్ స్థాయిల్లో స్కూళ్లు, కాలేజీలను తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో వేజన్న, తహసీల్దార్ వినయ్‌సాగర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, వెంకటేశ్వర్లుగౌడ్, సంపత్‌కుమార్, జగన్, రఘురాములు, పెంటారెడ్డి, అశోక్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, లాలయ్యగౌడ్, నర్సింహాగౌడ్, విజయమ్మ, వెంకట్‌రెడ్డి, యాదయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, రవికుమార్‌గౌడ్, బొజ్జ సాయిరెడ్డి, హరిమోహన్‌గౌడ్, పాండుగౌడ్, పి.జంగయ్య, నూదిని కొండల్‌రెడ్డి, మల్లేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

గ్రామాల్లో వసతుల కల్పనే లక్ష్యం

మాడ్గుల: గ్రామాల్లో వసతుల కల్పనే లక్ష్యమని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. నాగిళ్లలోని ఎస్సీ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. పాఠశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు.

తల్లిదండ్రులు మాట్లాడటంలేదని కుమార్తె ఆత్మహత్య

బీబీనగర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించి, మాట్లాడడం మానేశారని మనస్తాపానికి గురైన ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం వెంకిర్యాలలో జరిగింది. సీఐ ప్రభాకర్ రెడ్డి, గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకిర్యాలకు చెందిన మార్త రమేష్ ఆర్టీసీ డ్రైవర్. అతడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె శ్రీవెన్నెల(17) తార్నాకలోని రైల్వే జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. నాలుగు రోజుల కిందట ఇంటికి ఆలస్యంగా రావడం, ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో తండ్రి రమేష్ కుమార్తెను తీవ్రస్థాయిలో మందలించారు. అంతేకాకుండా ఇంట్లో ఎవరూ శ్రీవెన్నెలతో సరిగా మాట్లాడడం లేదు. ఈ నేపథ్యంలో ఆదివారం బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో తల్లిదండ్రులు శ్రీవెన్నెలను ఇంట్లోనే ఉంచి మరో కుమార్తె, కుమారుడితో కలిసి వెళ్లారు. సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికి వచ్చే సరికి శ్రీవెన్నెల ఇంట్లో ఉరేసుకొని చనిపోయింది. రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

విరమణ ఉద్యోగానికే.. సేవలకు కాదు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విరమణ అనేది ఉద్యోగానికే గానీ సామాజిక సేవలకు కాదని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద పాఠశాలలో పనిచేసిన ఎస్. జనార్ధన్‌రెడ్డి రిటైర్మెంట్ సన్మాన కార్యక్రమం సోమవారం ఠాగూర్ ఫంక్షన్‌హాలులో జరిగింది. ఎమ్మెల్సీలు ఏవీఎన్‌రెడ్డి, నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డిలు హాజరై జనార్ధన్‌రెడ్డి దంపతులను సన్మానించి అభినందించారు. వారు మాట్లాడుతూ.. ప్రతి ఉద్యోగికి 60సంవత్సరాలు పూర్తికాగానే ఉద్యోగ విరమణ ఉంటుందని, అంత మాత్రాన జీవితం అయిపోదన్నారు. ఆరోగ్యాన్ని, శారీరకశక్తిని కాపాడుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. హెచ్‌ఎం కె.శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో షాద్‌నగర్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కె.మదన్‌మోహన్ రెడ్డి, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి సురేష్, జిల్లా అధ్యక్షుడు కాశీరావు, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కె.రాజీవ్‌రెడ్డి, వెంకటేష్ గుప్తా, కె.మనోహర్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

ఉబికి వస్తున్న గంగ



భారీ వర్షాల నేపథ్యంలో చేవెళ్ల మండలంలోని వాగులు, కుంటలు, చెక్‌డ్యాంలు నిండాయి. భూగర్భ జలమట్టాలు పెరుగుతూ పాతాళ గంగపైకి వస్తోంది. చేవెళ్ల పరిధి మల్కాపూర్‌లో రైతు గండు రాంచంద్రయ్య పొలంలోని బోరు నుంచి కొద్ది రోజులుగా నీరు ఉబికివస్తోంది. బోరు మోటర్ ఆన్ చేయకుండానే కేసింగ్ నుంచి నీరు వస్తోందని రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. గ్రామంలో మరి కొన్ని బోర్ల నుంచి కూడా నీరు పొంగుతోందని గ్రామస్తులు తెలిపారు.

- చేవెళ్ల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి)

రేపు వికారాబాద్‌లో మెగా హెల్త్ క్యాంప్

- డీఎంహెచ్‌వో లలితాదేవి

వికారాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లో సెప్టెంబరు 17న మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహిస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితాదేవి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో 'స్వస్థ్ నారీ స్వశక్తీ పరివార్ అభియాన్'పై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. అక్టోబరు 2 వరకు జిల్లాలో మహిళల ఆరోగ్య క్యాంప్‌లు నిర్వహిస్తామని తెలిపారు. జూమ్ ద్వారా రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించి, క్యాంపుల్లో మహిళల ఆరోగ్య సమస్యల పరిష్కారంపై ప్రత్యేకదృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ ఆనంద్, తాండూరు జిల్లాసుపత్రి, కొడంగల్ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు మాలతి, సునీత, డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్రయాదవ్, వైద్యులు పవిత్ర, బీబీ జానీ, బుచ్చిబాబు, గోపాల్, నిరోషా, ప్రవీణ్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, డిప్యూటీ డెమో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన భూ నిర్వాసితులు



ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసిన ట్రిపుల్‌ఆర్ బాధితులు

పూడూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గ్రామాల్లో ట్రిపుల్‌ఆర్‌కు భూములు కోల్పోతున్న రైతులు సోమవారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. మొదట రూపొందించిన అలైన్మెంట్ ప్రకారమే రీజినల్ రింగ్ రోడ్డును నిర్మించాలని కోరారు. ఎంపీ స్పందిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కోదండరాంను కూడా రైతులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర గొప్పది

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో గొప్పదని వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు దొంతు పాండురంగయ్య అన్నారు. షాద్‌నగర్‌లోని కన్యక పరమేశ్వరి ఆలయంలో సోమవారం వాసవి క్లబ్ అధ్యక్షుడు కల్వ మాణిక్యం, వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు కల్వ మధుప్రియల సంయుక్త ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డేను జరుపుకున్నారు. ఆర్య వైశ్య ఇంజినీర్లను సన్మానించారు. ఇంజనీర్లు మేధస్సును వినియోగించి, అంకిత భావంతో పనిచేస్తే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ నాయకులు సురేష్‌కుమార్, జి.వెంకటరమణ, జి.సత్యనారాయణ, సంఘం నాయకులు శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్, వి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్‌గా జ్యోతిప్రసాద్



కందుకూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాచులూరుకు చెందిన దంతోజు జ్యోతిప్రసాద్ ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. ఈ నెల 13, 14 తేదిల్లో షాద్‌నగర్‌లో ఠాగూరు స్కూల్ ఆడిటోరియంలో నిర్వహించిన ఏబీవీపీ అభ్యాస వర్గ నిర్వహించారు. ఈ సంద ర్భంగా జ్యోతిప్రసాద్‌ను హాస్టళ్ల కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబా టులో ఉంటూ సేవలందిస్తానని చెప్పారు.

క్లస్టర్లలో జీపీవోల నియామకం

కేశంపేట/కొందుర్గు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామ పాలన అధికారులు(జీపీవో) విధుల్లో చేరారు. సోమవారం కేశంపేట మండలంలో 11 క్లస్టర్లలో తొమ్మిది మంది జీపీవోలు జాయినయ్యారు. తమ అపాయింట్‌మెంట్ ఆర్డర్లను తహసీల్దార్ ఆజం అలీకి అందించారు. ఇప్పలపల్లి క్లస్టర్‌కు రాజేశ్వరి, లేమామిడికి హేమలత, నిర్దవెల్లికి వెంకటయ్య, కేశంపేటకు శంకర్, వేములనర్వకు విజయలక్ష్మి, తొమ్మిదిరేకులకు కృష్ణయ్య, సంతాపూర్‌నకు గిరీష్‌కుమార్, కొత్తపేటకు పెంటయ్య, అల్వాలకు సేవ్యానాయక్, సంగెంకు లింగమూర్తి నియామకం అయ్యారని తహసీల్దార్ తెలిపారు. కొందుర్గు మండలానికి తొమ్మిది మంది జీపీవోలు వచ్చారని డిప్యూటీ తహసీల్దార్ రాకేశ్ తెలిపారు. వీరు గత వీఆర్వోల స్థానాల్లో గ్రామ పాలన అధికారులుగా విధులు నిర్వహిస్తారని తెలిపారు.

వాహనాల తనిఖీ

యాచారం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వాహనాదారులు తమ వెంట విధిగా ఆర్‌సీలు, డ్రైవింగ్ పత్రాలు ఉంచుకోవాలని సీఐ నందీశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్య నేరమని, వేగంగా వాహనాలు నడుపొద్దని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని వాహనాదారులకు సూచించారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు సత్యనారాయణ, ప్రియాంక ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఆర్టీసీ, శ్రీ సాయిబాబా నగర్ కాలనీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.ధన్‌రాజ్‌గౌడ్, గౌరవాధ్యక్షులుగా మొద్దు సికిందర్‌రెడ్డి, కావలి వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా నర్సింహారావు, సురేష్, ప్రధాన కార్యదర్శిగా జి.యాదయ్య, ఉప కార్యదర్శిగా సి.మణికంఠ, కోశాధికారిగా బి.శ్రీధర్‌రెడ్డిలు ఎన్నికైనారు.

త్రోబాల్ పోటీల్లో ప్రతిభ

కొత్తూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని ఎస్‌వీఆర్ పాఠశాల విద్యార్థులు త్రోబాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఇటీవల స్థానిక లిటిల్ ఏంజిల్ పాఠశాలలో సౌత్‌జోన్ త్రోబాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన ప్రణ్య, దీక్షా, సంజని, లక్ష్మీదేవి, అశ్విన్‌తేజ, రాము, రూపేష్, హర్ష పాల్గొని ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ వీరమోని దేవేదర్‌ముదిరాజ్, ప్రిన్సిపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఆనంది, ఉపాధ్యాయులు సుమన, రాహుల్, భాగ్య అభినందించారు.

వీరేందర్ గౌడ్‌కు సన్మానం

కేశంపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన వీరేందర్ గౌడ్‌ను కేశంపేట మండల బీజేపీ నాయకులు సోమవారం కలిశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఆయనను కలిసి శాలువతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పసుల నరసింహ యాదవ్, జిల్లా సాంస్కృతిక శాఖ కోకన్వీనర్ కర్రెడ్ల నరేందర్ రెడ్డి, మండల ఎన్నికల కన్వీనర్ కంచుకోట మహేష్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

షాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీరామ కాలనీలో పారిశుధ్యంపై దృష్టి సారించాలని, తాగడానికి నీటిని సరఫరా చేయాలని కాలనీవాసులు సోమవారం ఎంపీడీవో అపర్ణకు వినతిపత్రం అందజేశారు. కాలనీ పక్కన కుళ్లిన మాంసం, కళేబరాలను పడవేస్తున్నారని, కొందరు పందులను పెంచడంతో ఈగలు, దోమలతో రోగాల పాలవుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

టీబీపై ఆందోళన వద్దు

కొత్తూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): టీబీపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పీహెచ్‌సీ డాక్టర్ దీప్తి అన్నారు. మున్సిపాలిటీలోని స్టేషన్‌తిమ్మాపూర్‌లో టీబీపై ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మందులతో టీబీ పూర్తిగా నయం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ఎస్ సరిత, ఉదయ్, సీహెచ్‌వో నాగేష్, టీబీ కోఆర్డినేటర్ రవి, షఫీ, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జీతాల్లో కోతలపై చర్యలు తీసుకోవాలి

మహేశ్వరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం మోడల్ స్కూల్లో స్కావెంజర్ల జీతాల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి పాఠశాల ప్రిన్సిపాల్‌ను విధులనుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌లో నిర్వహించిన ప్రజావాణితోపాటు జిల్లా అదనపు విద్యాధికారి పూర్ణచందర్‌కు వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ స్కావెంజర్ల వేతనాల్లో కోతలు కోస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేయని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా తరంగ్, సిద్ధు, తరుణ్, రాహుల్, కిరణ్, భరత్, జశ్వంత్ ఉన్నారు.



కడ్తాల: తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



చేవెళ్ల: తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



యాచారం: తహసీల్దారు కీర్తిసాగర్‌కు వినతిపత్రమందిస్తున్న పింఛన్‌దారులు

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి

పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సామాజిక పెన్షన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా పెన్షన్‌దారులు ఆందోళనలు చేపట్టారు. తహసీల్దారు కార్యాలయాల ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. వృద్ధాప్య, వితంతు పెన్షన్లు రూ.4,000కు, దివ్యాంగుల పెన్షన్లు రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా నేటికి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. పెన్షన్లను పెంచకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, సెప్టెంబరు 15



మహేశ్వరం: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వృద్ధులు, నాయకులు



శంషాబాద్: తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న దివ్యాంగులు



షాద్‌నగర్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పింఛన్‌దారులు, నాయకులు



విరాళం చెక్కు అందజేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆలయాలు వారసత్వ సంపద

టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆలయాలు, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు, వెల్దండ మండలాల్లో సోమవారం పర్యటించారు. కొత్త గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి రూ.2.20 లక్షల విరాళం ప్రకటించి ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. నాయకులు రాములు, అల్లాజీ, లక్ష్మయ్య, మల్లయ్య, బాల్‌చంద్రయ్య, మొగులయ్య, ఆంజనేయులు, చెన్నయ్య, కాశయ్య, జంగయ్య, శ్రీరాములు, పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

యాచారం/మంచాల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న క్లాస్‌మేట్‌కు రూ.1.75 అందించి మానవత్వం చాటుకున్నారు. మండలంలోని మేడిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 1999-2000 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన యాదయ్య ఇటీవల బైక్ అదుపుతప్పి కిందపడగా తలకు బలమైన గాయమైంది. చికిత్స కోసం కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతుండగా పూర్వ విద్యార్థులంతా ఆదివారం నగరంలోని కామినేని ఆసుపత్రిలో క్షతగాత్రుడి భార్య స్వాతికి నగదు అందించారు. అలాగే మంచాల మండల పరిధిలోని అరుట్ల గ్రామానికి చెందిన నూకం జంగయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. అరుట్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన 1999 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు తలాకొంత వేసుకొని రూ.72 వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే కందుకూరు ఉన్నత పాఠశాల 2001-02 బ్యాచ్ విద్యార్థి దశరథ(40) ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. తోటి మిత్రులు గూడూరు గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.లక్ష నగదును అందజేశారు.

బాధిత కుటుంబానికి..

తలకొండపల్లి: చుక్కాపూర్ గ్రామానికి చెందిన అంజయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని స్థానిక నాయకులు ఏమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఏమిరెడ్డి పాండురంగారెడ్డి పరామర్శించి బాధిత కుటుంబానికి రూ.5 వేలు సమకూర్చగా మాజీ ఎంపీటీసీ యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. అదేవిధంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి రూ.3 వేలు, మాజీ సర్పంచ్ కిష్టమ్మ రూ.వెయ్యి ఆర్థికసాయం అందించారు.

విమోచనాన్ని అధికారికంగా నిర్వహించాలి

కందుకూరు,సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని సెప్టెంబరు 17న అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలో నిర్వహించిన సేవా పక్వాడ్ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈనెల 17న ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లె కృష్ణగౌడ్, సాధ మల్లారెడ్డి, జిట్ట రాజేందర్‌రెడ్డి, పున్న భిక్షపతి, నర్సింహారెడ్డి, సత్తయ్య, కృష్ణారెడ్డి, అచ్చన్న పాండు, జంగారెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరులో మాట్లాడుతున్న బొక్క నర్సింహారెడ్డి

ఆకట్టుకున్న 'టీఎల్‌ఎం' మేళా



కొందుర్గు: టీఎల్‌ఎం మేళాలో మెటీరియల్స్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



చౌదరిగూడ: మేళాలో ఉపాధ్యాయులు

చౌదరిగూడ/కొందుర్గు/షాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు, షాబాద్ మండలాల్లో నిర్వహించిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్‌ఎం) మేళాలు విజయవంతమయ్యాయి. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన టీఎల్‌ఎల్ మేళాకు మండల విద్యాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఉపాధ్యాయుల బోధనోపకరణల ప్రదర్శన ఆకట్టుకుంది. కొందుర్గు మండలంలో నిర్వహించిన మేళాలకు ఇన్‌చార్జి ఎంఈవో గాయత్రి హాజరయ్యారు. ఉపాధ్యాయులు తయారుచేసిన చార్టును పరిశీలించారు. అలాగే షాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మేళాకు ఎంపీడీవో అపర్ణ, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన విజేతలకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందించి అభినందిచారు. మన్‌మర్రి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మర్పల్లి అశోక్ ప్రదర్శించిన గణితశాస్త్ర ప్రదర్శన జిల్లా స్థాయి మేళకు ఎంపికైనట్లు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ఆమనగల్లు: నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యాజమాన్యం

ఆమనగల్లు/కందుకూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కా లర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 15 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు కళాశాల యాజమాన్యం పేర్కొం ది. సమ్మెలో భాగంగా ఆమనగల్లు పట్టణంలోని మాస్టర్స్ డిగ్రీ కళాశాల ఎదుట సోమవారం విద్యార్థులతో కలిసి సమ్మె చేపట్టారు. ఫీజు రీ యింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ చందు, అధ్యాపకులు చెన్నయ్య, శివలింగం, నాగరాజు పాల్గొన్నారు.

కందుకూరులో..

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిపుల నిధులను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ స్టూడెంట్ ఫర్ డవలప్‌మెంట్ కన్వీనర్ డిల్లీ భానుప్రసాద్ డిమాండ్ చేశారు. ఏబీవీపీ నగర శాఖ కార్యదర్శి జి.వినయ్ ఆధ్వర్యంలో ఆయా పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైదరాబాద్ - శ్రీశైలం హైవేపై రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధరణి, మహేష్, నందు, వరుణ్, శశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఒక్కరి నేత్ర దానం.. ఇద్దరికి దృష్టి భాగ్యం

ఆమనగల్లు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఒక్కరి నేత్ర దానంతో ఇద్దరికి దృష్టి భాగ్యం కలుగుతుందని లయన్స్‌క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాసులు అన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జ్యోతి, డాక్టర్ షైమూనా బేగం, ఎంపీహెచ్ఈవో తిరుపతి రెడ్డి, పీఆర్‌వో ఎంఎ పాషా, లయన్స్‌క్లబ్ సభ్యులు కర్నాటి కొండల్ రెడ్డి, పాండు, జహంగీర్‌అలీ, దాసు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కదులుతున్న పీఠాలు!

(5వ పేజీ తరువాయి)

ఛైర్మన్లను తొలగించాలని కొందరు కాంగ్రెస్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దాంతో బీఆర్ఎస్‌కు చెందిన సొసైటీ ఛైర్మన్లను తొలగించాలనే ఆలోచనకు వచ్చారు. ఛైర్మన్ల తొలగింపుపై డీసీసీబీ అధికారులు గుట్టుగా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని యాచారం, ఎంపీ పటేల్‌గూడ, రాచకొండ మైలారం, మాడ్గుల, ఆమనగల్లు, బాటసింగారం, కందుకూరు. పాల్మాకుల, మహేశ్వరం సొసైటీల ఛైర్మన్లను పదవి నుంచి తొలగించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ విషయాన్ని తెలిసిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన సొసైటీ ఛైర్మన్లు ఇదేంటని ప్రశ్నిస్తున్నారు. సొసైటీల ఛైర్మన్ల తొలగింపునకు స్థానిక ఎమ్మెల్యేలు చాలా కీలకంగా మారినట్లు తెలుస్తోంది.

సమాలోచనలో బీఆర్ఎస్ నాయకులు

జిల్లాలోని తొమ్మిది సొసైటీల ఛైర్మన్లను పదవుల నుంచి తొలగింపు అంశాన్ని బీఆర్ఎస్ జిల్లా నాయకులు సమాలోచనలు చేస్తున్నారు. ఛైర్మన్లను పదవీ నుంచి తొలగించిన వెంటనే ఉద్యమానికి సిద్ధం అవుతున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ఛైర్మన్ల తొలగింపు ప్రయత్నం రాజకీయ కక్ష సాధింపు అంటున్నారు. ఇటీవల ఓ ఛైర్మన్ తనను తొలగించరాదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసినట్లు తెలిసింది.

ఓవర్ డ్యూస్ ఉంటే..

సొసైటీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్, డైరెక్టర్లు సొసైటీలో రుణం పొంది ఇంతవరకు వడ్డీ కూడా చెల్లించకుండా ఓవర్‌డ్యూ ఉన్న వారందరినీ పదవుల నుంచి తప్పించడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సొసైటీ ప్రతినిధులుగా ఉండి పదిమందికి ఆదర్శంగా ఉండాల్సింది పోయి.. వారే ఓవర్‌డ్యూ ఉండటంపై అధికారులు చాలా సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. వారందరినీ తొలగించాలని నిర్ణయించినట్లు సమాచారం.

నా చేతిలో ఏమీ లేదు



నా చేతిలో ఏమీ లేదు. అంతా డీసీసీబీ అధికారులు చూసుకుంటున్నారు. ఎవరినీ తొలగించే అధికారం నాకు లేదు. కొత్త ఛైర్మన్లను నియమించే బాధ్యతలు ఎవరు చూసుకుంటున్నారో తెలియదు. కందుకూరు ఛైర్మన్‌ను తొలగించినట్లు తెలిసింది.

- కొత్తకురుమ సత్తయ్య, డీసీసీబీ ఛైర్మన్

మేము కోర్టుకు వెళ్తాం



రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తోంది. ప్రభుత్వ విధానాలపై మేము హైకోర్టుకు వెళ్తాం. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్‌కు చెందిన ప్రజాప్రతినిధులను ఎంతో గౌరవించాం. వీరిలాగా ఇతర పార్టీల వారిని పదవుల నుంచి తొలగించలేదు. కాంగ్రెస్ పాలనలో ఇతర పార్టీల నాయకులు ఛైర్మన్లుగా ఉండకూడదా. దేశంలో ఇంత నీచ సంస్కృతి ఎక్కడా లేదు.

- కె.రమేష్‌గౌడ్, బీఆర్ఎస్ యాచారం మండల అధ్యక్షుడు

క్రైం కార్నర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. శంషాబాద్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బుర్జుగడ్డ తండాకు చెందిన రోళ్ల వెంకట సుబ్బయ్య(57) భార్య రోళ్ల లక్ష్మి ఆరు నెలలుగా బుర్జుగడ్డ తండా పరిధిలోని దీప్రాజ్ సింగ్ ఫాంహౌస్‌లోనే నివాసం ఉంటున్నారు. భర్త వెంకట సుబ్బయ్య తండ్రి కోటయ్య మూడు నెలల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి వెంకటసుబ్బయ్య మానసికంగా బాధపడుతున్నాడు. సోమవారం ఉదయం తెల్లవారుజామున గార్డెన్‌లో క్లీన్ చేయడానికి వెళ్లాడు. రోజు మాదిరిగా టీ తాగేందుకు భర్తకు ఫోన్ చేస్తే స్పందించలేదు. దీంతో భార్య లక్ష్మి గార్డెన్‌లోకి వెళ్లగా మామిడి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో మరొకరు..

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శంషాబాద్ మండలంలోని పెద్దతూప్ర తండాకు చెందిన కేతావత్ రాందాస్(43) ఆదివారం మద్యం మత్తులో వ్యవసాయ పొలంలో యూరియా చల్లుతానని వెళ్లాడు. పొలం నుంచి ఇంటికి రాకపోవడంతో అతని సోదరుడు కేతావత్ మోహన్ రాత్రి పొలం వద్దకు వెళ్లి చూడగా కింద పడి చనిపోయి ఉన్నాడు. పక్కనే తెగిపోయి ఉన్న స్టార్టర్ విద్యుత్ తీగ ఉంది. ప్రమాదవశాత్తు తెగిపోయి ఉన్న స్టార్టర్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి యువకుడు..

కొత్తూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్నాడని, తెల్లని బనియన్, తెల్లని అండర్‌వేర్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. తిమ్మాపూర్ స్టేషన్ మాస్టర్ వినీత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

సింబియాసిస్ యూనివర్సిటీలో కార్మికుడు..

నందిగామ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నందిగామ పోలిస్‌స్టేషన్ పరిధిలోని మొదళ్లగూడలోని సింబియాసిస్ యూనివర్సిటీలో విద్యుదాఘాతంతో కార్మికుడు మృతిచెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలిసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్ర సతారా జిల్లా కినాహి గ్రామానికి చెందిన అమిత్‌కుమార్(32) హిప్రో వాషింగ్ క్లీనింగ్ సర్వీసెస్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం నందిగామ మండల పరిధిలోని సింబియాసిస్ యూనివర్సిటీలో సెప్టిక్ ట్యాంక్ వద్ద క్లీనింగ్ చేస్తుండగా విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. కళాశాల యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

కోళ్ల దాణాను నిల్వ చేసిన వ్యక్తిపై కేసు

యాచారం. సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అక్రమంగా కోళ్ల దాణాను నిల్వ చేసిన వ్యక్తిపై యాచారం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని నందివనపర్తి, మల్కీజ్‌గూడ గ్రామాల్లో స్నేహ చికన్ సెంటర్ నిర్వాహకులు బాయిలర్ కోళ్ల పెంపకందారులకు కోడి పిల్లలకు దాణా ఉచితంగా అందిస్తున్నారు. కోళ్ల కోత వరకు వచ్చేదాక దాణా ఇస్తారు. కాగా మల్కీజ్‌గూడకు చెందిన రైతు కృష్ణ స్నేహ చికెన్ సెంటర్‌దారులు ఇచ్చే దాణాను అక్రమంగా నిల్వ చేశారు. దాణా త్వరితగతిన పూర్తవడంతో కంపెనీ నిర్వాహకులకు అనుమానం వచ్చి నిఘా వేశారు. దీంతో దాణా నిల్వ చేయడాన్ని చూసిన స్నేహ చికెన్ సెంటర్ నిర్వాహకులు దాణాను పట్టుకొని యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రియాంక తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శంకర్‌పల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న వ్యక్తులను పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. శంకర్‌పల్లి మున్సిపల్‌లోని పత్తేపూర్‌లోని ఆల్ట్రాటెక్ కంపెనీకి చెందిన డ్రైవర్లు కంపెనీలోని వెయిటింగ్ రూమ్‌లో పేకాట ఆడుతుండగా రాజేంద్రనగర్ ఎస్వోటీ, శంకర్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మంది డ్రైవర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద గల రూ. 10,970 నగదు, ఎనిమిది ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శంకర్‌పల్లి ఎస్సై సురేష్ తెలిపారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కేఎల్లార్

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

మహేశ్వరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వచ్చి సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నియోజకవర్గంలో వేలాది మంది పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. సోమవారం తుక్కుగూడలోని కాంగ్రెస్ కార్యాలయంలో మహేశ్వరం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్‌రెడ్డి, మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ యాదయ్య పాల్గొన్నారు.

ఆమనగల్లు/కందుకూరు: ఆమనగల్లుకు చెందిన పల్లె దశరథ్ గౌడ్‌కు రూ.54 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. సోమవారం ఆమనగల్లులో ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అతడికి అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహ, ఆమనగల్లు బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డి, లక్ష్మణ్, రవిరాథోడ్, శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, చెన్నకేశవులు, ఎర్రవోలు శ్రీను ఉన్నారు. కందుకూరు మండలంలోని ఆకులమైలారానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మహేశ్వరం ఏఎంసీ డైరెక్టర్ అండేకార సురేందర్, ఆకులమైలారం మాజీ ఉపసర్పంచ్ రాజు అందజేశారు. నాయకులు ఎడ్ల రాంరెడ్డి, శ్రీశైలం, యాదగిరి, శ్రీకాంత్, సత్యం, సురేష్, పవన్, అమరేందర్‌రెడ్డి, రితిష్, భాస్కర్, సూర్య, నరసింహ, అశోక్, వీరమ్మ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలి



పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీ టీచర్లు

కందుకూరు,సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను తక్షణమే మార్చాలని రైతు సంఘం జిల్లా దుబ్బాక రాంచందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కానుగుల వెంకటయ్యతో కలిసి రీజినల్ రింగ్‌రోడ్డు భూ నిర్వాసితులతో కలిసి మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వందల ఎకరాలున్న భూస్వాముల భూములను కాపాడడం కోసమే చిన్న, సన్నకారు రైతుల భూములను లాక్కుంటుందని ఆరోపించారు. కొత్తగా మార్చిన అలైన్మెంట్‌ను రద్దు చేసి పాత అలైన్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కురుమయ్య, వశంకర్, కుమార్, వెంకటస్వామి, బాధిత రైతులు, తదితరులు పాల్గొన్నారు.